గాలి కుంటు వ్యాధితో ప్రమాదం

- వ్యాధి నివారణకు నేటినుంచి పశువులకు టీకాలు
- టీకాలు వేసేందుకు 20 బృందాల ఏర్పాటు


పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం (ఫైల్)


పశువులు

బుట్టాయగూడెం: పశువుల్లో సోకే వ్యాధుల్లో గాలి కుంటు ఒకటి. సకాలంలో వ్యాధి లక్షణాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే పశువులు, వాటి పాలు తాగిన దూడలు మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో గాలికుంటు వ్యాధి నివారణకు పశుసంవర్ధక శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా పశువులకు టీకాలు వేసేందుకు సిద్ధమైంది. నెల రోజుల పాటు గిరిజన ప్రాంతంలో పశువులకు టీకాలు వేయనున్నారు.

గిరిజన మండలాల్లో 1,61,730 జీవాలు

ఏజెన్సీ ప్రాంతంలో గల గిరిజన మండలాలైన బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలో గల గ్రామాల్లో సుమారు 1,16,730 జీవాలు ఉన్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. వీటిలో ఆవులు 53,586, గేదెలు 38,336, గొర్రెలు 24,774, మేకలు 45,034 ఉన్నాయి. వీటన్నింటికి టీకాలు వేసేలా అధికారులు సిద్ధమవుతున్నారు.

నేటి నుంచి అక్టోబర్ 15 వరకూ టీకాలు

పశుసంవర్ధక అధికారులు సోమవారం నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకూ గ్రామాల్లో అన్ని రకాల పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణకు సంబంధించి టీకాలు వేయనున్నారు. 4 నెలల పైబడిన ప్రతి పశువుకు ఉచితంగా టీకా వేస్తారు. పాడి రైతులు తప్పనిసరిగా పశువులకు టీకా వేయించాలని అధికారులు కోరుతున్నారు. పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు సంబంధించి ఏజెన్సీ ప్రాతంలోని ఉన్న గిరిజన మండలాలకు సుమారు 16,572 డోసుల టీకాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఉన్న పశువులకు టీకాలు వేసేందుకు 20 బృందాలు ఏర్పాటు చేశారు. టీకాలు వేసిన పశువులకు గుర్తుగా కొమ్ములకు ఆకుపచ్చ రంగు వేస్తారు. ఉదయం వేళ చల్లటి సమయంలోనే టీకాలు వేస్తారు.

పశువులకు టీకాలు వేయించాలి



పాడి రైతులు తప్పనిసరిగా తమ పశువులకు గాలికుంట వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి. గ్రామాల్లో అన్నిరకాల పశువులకు ఉచితంగా టీకాలు వేయడం జరుగుతుంది. సోమవారం నుంచి నెల రోజుల పాటు 20 బృందాలు అన్ని రకాల పశువులకు టీకాలు వేస్తారు.

– డాక్టర్ మల్లంపల్లి సాయిబుచ్చారావు, సహాయ సంచాలకులు, జీలుగుమిల్లి

జలాశయం, ఎర్రకాలువ కాజ్‌వే వద్ద పోలీసు బందోబస్తు


కాజ్‌వే వద్ద ఎర్రకాలువ వాగును పరిశీలిస్తున్న సీఐ సుభాష్, రెవెన్యూ సిబ్బంది

జంగారెడ్డిగూడెం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కేకేఎం ఎర్రకాలువ జలాశయంలో భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మండలంలోని పంగిడిగూడెం – రాజవరం మధ్యలోని కాజ్‌వే వద్ద ఎర్రకాలువ వరద ప్రవాహం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. కాజ్‌వై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాలతో జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్ పోలీసు, రెవెన్యూ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు. కేకేఎం ఎర్రకాలువ జలాశయం వద్ద, పంగిడిగూడెం – రాజవరం కాజ్‌వే వద్ద పోలీసు, రెవెన్యూ సిబ్బందితో పికెట్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిని విశ్లేషించి, ప్రజలకు, ఆస్తులకు ఎటువంటి నష్టం జరగకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున ప్రజలు కాలువను దాటరాదన్నారు. ప్రమాద పరిస్థితులు ఏర్పడినప్పుడు వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా రెవెన్యూ అధికారులకు, లేదా డయల్ 112కు సమాచారం అందించాలన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


దాత విశ్వనాథకుమార్‌కు విరాళం బాండ్‌ను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందించారు. తణుకు మండలం వెంకటరాయపురంనకు చెందిన పాతూరి వెంకట సత్య విశ్వనాధకుమార్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ విరాళం బాండ్‌ను అందజేశారు.

అన్నదాన కమిటీకి విరాళం


అన్నదాన కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న సరితా రెడ్డి కుటుంబ సభ్యులు

కామవరపుకోట: స్థానిక శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర స్వామి ఆలయంలో అన్నదాన కమిటీకి జలపావారిగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కేసరి సరితా రెడ్డి, కుటుంబ సభ్యులు రూ.50 వేల విరాళం అందజేశారు. ఆలయంలో మాలధారణ చేసిన స్వాములకు 50 రోజులపాటు భిక్షా కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో సరితా రెడ్డి తన భర్త విజయభాస్కర్ రెడ్డి జ్ఞాపకార్థం విరాళం అందజేశారు. కార్యక్రమంలో అన్నదాన కమిటీ సభ్యులు మారం రమేష్, బొల్లు సత్యనారాయణ, కేసరి రఘుపతి రెడ్డి, కానూరి భద్రి, కంబంపాటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతులు


రెడ్డిగణపవరం సమీపంలో కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన దృశ్యం

బుట్టాయగూడెం: భారీ వర్షాల కారణంగా కొండవాగు పొంగి మండలంలోని రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరు వాగుపై నిర్మించిన కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు ద్విచక్రవాహనం తప్ప వేరే వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. సమాచారం తెలుసుకున్న ఎన్‌హెచ్ 365 బీబీ జాతీయ రహదారి అధికారులు ఈ కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

జంగారెడ్డిగూడెం: స్థానిక సుబ్బారెడ్డి కాలనీకి చెందిన వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ పి.బాబూరావు తెలిపారు. ఈ నెల 10వ తేదీన వెంపటి దొరబాబు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి లేదు. చుట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద ఆచూకీ కోసం వెదికినా ఫలితం లేకపోవడంతో ఆయన కుమారుడు నరేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లోక్‌అదాలత్‌లో 30 కేసుల రాజీ

దెందులూరు: జాతీయ లోక్ అదాలత్‌లో 30 కేసులు రాజీ అయ్యాయని ఎస్సై రాచమల్లు శివాజీ అన్నారు. ఆదివారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ శనివారం భీమడోలు కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలతో దెందులూరు మండలం సంబంధించి చిన్న చిన్న గొడవలు, యాక్సిడెంట్ కేసులు, వివాహ సమస్యలు, ఆర్థిక పరమైన లావాదేవీలు కేసులు వంటి 30 కేసులు న్యాయమూర్తి సమక్షంలో రాజీ అయ్యాయన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ శాంతి యుతంగా ప్రశాంతంగా జీవించాలని గొడవలు, అల్లర్లు, అశాంతి, కొట్లాటలకు దూరంగా ఉండాలని ఎస్సై సూచించారు.

17 నుంచి వైద్య శిబిరాలు

దెందులూరు: ఆరోగ్యవంతమైన సమాజ లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ నెల 17 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు రెండు వారాల పాటు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి రాకేష్ తెలిపారు. ఆదివారం గోపన్నపాలెం వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు, బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వైద్య సేవలు పొందాలని సూచించారు.

వాహనమిత్రకు దరఖాస్తుల స్వీకరణ

ఉంగుటూరు: వాహనమిత్ర పథకానికి ఈ నెల 17 నుంచి దరఖాస్తును సంబంధిత సచివాలయాల్లో చేసుకోవాలని ఎంపీడీవో రాజీమనోజు తెలిపారు. వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్సు, దరఖాస్తుతో పాటు అందజేయాలని , ఈ అవకాశాన్ని వాహనాలు, ఆటో రిక్షాల వారు ఉపయోగించుకోవాలని కోరారు.

17న విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

ద్వారకాతిరుమల: స్థానిక ఆళ్వార్ సదనంలో ఈనెల 17న విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ నేతలు తెలిపారు. అందులో భాగంగా ఆరోజు ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వర పూజ, గాయత్రీ విశ్వకర్మ పూజ, 10 గంటలకు జెండా ఆవిష్కరణ, 11.30 గంటలకు మహా ప్రసాదం నివేదన జరుపుతామన్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన, 2 గంటలకు గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

వైఎస్సార్ సీపీ గుంటుపల్లి అధ్యక్షుడిగా శ్రీనివాసరావు


గుంటుపల్లి నూతన గ్రామ కమిటీ సభ్యులు

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ గుంటుపల్లి గ్రామ అధ్యక్షుడిగా సేవా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు ఆదేశాలమేరకు పార్టీ మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ రామకృష్ణరాజు (చినబాబు) అధ్యక్షతన, కనుమూరి అంజిరెడ్డి పరిశీలకులుగా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా దేవరపల్లి ధర్మారావు, చిట్టిబొమ్మ రంగారావు, మర్రిపాటి వెంకట్రావు, ముంగమూరి నరేష్, కార్యదర్శులుగా ఏలూరి శ్రీనివాసరావు, కోట సురేష్, షేక్ ఇమామ్, కె.మహేష్, వైఎస్సార్‌సీపీ మండల వైస్ ప్రెసిడెంట్‌గా తమ్మిశెట్టి సూర్యప్రకాష్ రావుని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ చింతలపూడి నియోజకవర్గ సీనియర్ నాయకుడు, జీలకర్రగూడెం సొసైటీ మాజీ సొసైటీ అధ్యక్షుడు మొరంపూడి సత్యనారాయణ, బాహుబలెంద్రుని నారాయణ రాజు, పార్టీ జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దాస్, పార్టీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కొమ్మిన నరేష్, సీనియర్ నాయకులు మందలపు కృష్ణారావు, ఎస్ఆర్.రంగారావు, తుమ్మల సీతారామయ్య, అల్లూరి పెద్దిరాజు, సూర్యనారాయణరాజు, గోరుముచ్చు శ్రీనివాసరావు, ముంగమూరు మహేష్ పాల్గొన్నారు.

రహదారి ఇలా.. వెళ్లేది ఎలా!


అధ్వానంగా ఉన్న కొత్తపల్లి, ధర్మాజీగూడెం రహదారి

లింగపాలెం గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు లింగపాలెం మండలంలోని ఏలూరు – చింతలపూడి వెళ్లే ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారులపై ఏర్పడిన గోతుల్లో నీరు నిలిచిపోవడంతో గోతులు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అర్అండ్‌బీ అధికారులు రహదారిపై గోతులు పూడ్చేందుకు చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

దడ పుట్టిస్తున్న వీధి కుక్కలు


ఓ వీధిలో కుక్కల దండు

లింగపాలెం మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ధర్మాజీగూడెం, లింగపాలెం, రంగాపురం తదితర గ్రామాల్లో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. ప్రతి వీధిలోనూ పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా తిరుగుతూ ద్విచక్ర వాహనాల మీద వెళ్లే వారిని, చిన్ని పిల్లలను వెంటపడి కరుస్తున్నాయి. మండలంలో రెండు నెలలుగా సుమారు 93 మంది కుక్కల వల్ల గాయాలపాలైనట్లు చెబుతున్నారు. దీంతో తమ ప్రాంతంలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయని ఫిర్యాదులు చేసే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. కుక్కల నియంత్రణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు ఏమాత్రం సత్ఫలితాలను ఇవ్వడం లేదని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లోకి రావాలంటే భయమేస్తుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిచి కుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

జలాశయంలోకి 5,143 క్యూసెక్కుల వరద నీరు


కేకేఎం ఎర్రకాలువ జలాశయం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం ఎర్రకాలవ జలాశయం నుంచి వరద నీటి విడుదల కొనసాగుతోంది. ఆదివారం మధ్యాహ్నం వరకు జలాశయం నుంచి అధిక మొత్తంలో వరద నీరు చేరగా అధికారులు దిగువకు నీటిని విడుదల చేశారు. కాగా రాత్రి 9 గంటలకు ఎర్రకాలువ జలాశయం నీటిమట్టం 82.69 మీటర్లుగా ఉంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 83.50 మీటర్లు. జలాశయంలోకి 5,143 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, అంతే మొత్తంలో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

అప్‌ల్యాండ్ క్షత్రియ సేవా సమితి సమావేశం


అప్‌ల్యాండ్ క్షత్రియ సేవా సమితి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: అప్‌ల్యాండ్ క్షత్రియ సేవా సమితి (యూకేఎస్ఎస్) సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు పెన్మెత్స రంగరాజు అధ్యక్షతన ఆదివారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, పేద వృద్ధులకు వైద్య సదుపాయం, పేద క్షత్రియులకు సహాయం చేయడం వంటి కార్యక్రమాలపై తీర్మానాలు చేశారు. రంగరాజు మాట్లాడుతూ ఏఎస్ఆర్ మున్సిపల్ పార్కు అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ట్రెజరర్ గొట్టుముక్కల భాస్కర్‌రాజు 2024–25 ఆర్థిక సంవత్సరం జమా ఖర్చులను తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, ఎస్ఆర్ఆర్ రామకృష్ణంరాజు, ఎఫ్‌కేఎస్ఎస్ డైరెక్టర్ మంతెన సోమరాజు, పెన్మెత్స రామరాజు, మంతెన సత్యనారాయణరాజు, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు పందిరి రాట


కనకదుర్గమ్మ ఆలయం వద్ద పందిరి రాట ముహూర్తం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: దేవీ శరన్నవరాత్రులకు పందిరి రాట ముహూర్తం ఆదివారం నిర్వహించారు. టెంపుల్స్ సెంటర్ వద్ద ఉన్న శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఉదయం 8:05 నిమిషాలకు అర్చకులు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా కొంపెల్ల సుబ్బారావు దంపతులు పూజలు నిర్వహించి పందిరి రాట గుంజను అమ్మవారి ఆలయం వద్ద ప్రతిష్టించారు. ఈనెల 22వ తేదీ నుంచి దేవి శరన్న వరాత్రులు ప్రారంభం కానున్నాయి. కనక దుర్గమ్మ ఆలయాలతో పాటు గ్రామదేవతల ఆలయాలు శరన్నవరాత్రుల పూజలకు సిద్ధం అవుతున్నాయి. రాజవరం, యర్రంపేట మెయిన్ సెంటర్లలో దసరా సందర్భంగా కనకదుర్గమ్మ విగ్రహాలను ప్రతిష్టించి తొమ్మిది రోజులపాటు పూజలు నిర్వహించనున్నారు.

ప్రమాదకరంగా మలుపు


ధర్మాజీగూడెంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

లింగపాలెం: ధర్మాజీగూడెం నుంచి ఏలూరు వైపు వెళ్లే శివాలయం సమీపంలో యు ఆకారంలో ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ మలుపు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల ఒక కారు, మరో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న డ్రెయినేజీలోకి దూసుకుపోయాయి. ఇవికాక ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

భీమడోలు: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని గుండుగొలను ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కాకి ఛార్లెస్ అన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాప్) ఆధ్వర్యంలో ఆదివారం గుండుగొలను ఆర్‌సీఎం చర్చిలో బాల్య వివాహాలపై సంఘ విశ్వాసులు, సండే స్కూల్ చిన్నారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బైబిల్‌లో ఉన్న వాక్యాన్ని విశ్వాసులకు ఫాదర్ ఛార్లెస్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన వాక్యోపదేశాన్ని అందించారు. ఫాదర్ ఛార్లెస్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వలన విద్య, ఆరోగ్యానికి దూరమవుతారని, వారిలో విజ్ఞానం అభివృద్ధి చెందకుండా అమాయకత్వంతో జీవించాల్సి వస్తుందన్నారు. జిల్లా కో–ఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా, మండలం, గ్రామాన్ని బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు.

విష జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి

దెందులూరు: గ్రామాల్లో విషజ్వరాలు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో గణనీయంగా నమోదవుతున్న దృష్ట్యా ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సుందర్‌బాబు అన్నారు. ఆదివారం వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మారిన ఆహారపు అలవాట్లకనుగుణంగా యువత చిన్నారుల్లో రక్తహీనత కలగటం, రోగ నిరోధక శక్తి లేకపోవడం , మారుతున్న వాతావరణం పరిస్థితులకు అనుగుణంగా విషజ్వరాలు నమోదు అవుతున్నాయన్నారు. గత పది రోజులుగా విషజ్వరాల బారిన పడిన వారు సంఖ్య పెరిగిందన్నారు. అధిక జ్వరం, కళ్లు, ముక్కు వెంట నీరు కారటం, ఒళ్లు నొప్పులు, తలపోటు, నీరసంగా ఉండటం, దగ్గు రావటం, వంటివి విషజ్వరాల లక్షణాలని వైద్యులు తెలిపారు. ప్రతి రోజూ కాచి చల్లార్చిన నీరు తాగాలని, సమీప వైద్యశాలలో వైద్య పరీక్షలు పొందాలని వైద్యులు తెలిపారు. డోలో ట్యాబ్లెట్లు ఉదయం, సాయంత్రం వేసుకోవాలని, ఆహారపు అలవాట్లు మితంగా ఉండాలని వైద్యులు సూచించారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

గణపవరం: పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని జల్లికొమ్మర హైస్కూల్ హెచ్ఎం పుప్పాల ప్రకాశరావు అన్నారు. ఆదివారం జల్లికొమ్మర హైస్కూలులో 2012–13 సంవత్సరంలో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ పాఠశాల ప్రాథమికోన్నత పాఠశాలగా ఉన్న సమయంలో ఏడో తరగతి వరకూ చదివి ఉన్నత చదువుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లేవారమని, నేడు గ్రామంలోనే హైస్కూలుగా ఉన్నతీకరణ చేసి పదో తరగతి వరకూ అవకాశం కల్పించడంపై ఆనందం వ్యక్తం చేశారు. హైస్కూలుగా ఏర్పడినందున కావలసిన సదుపాయాల కల్పనకు పూర్వ విద్యార్థులు సహకరించాలని హెచ్ఎం ప్రకాశరావు కోరగా వారు అంగీకరించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు సత్కరించారు.